ప్రజా మంటలు

గురువారం 21 - 05 - 2026

# విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చిన కెసిఆర్

## మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, (ప్రజా మంటలు) మే 20:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనకు అనుగుణంగా కెసిఆర్ విద్య, వైద్యానికి ప్రాధాన్యత నిస్తూఅన్ని వర్గాల ప్రజలకు రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయనజగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీ మాజీ ఛైర్పర్సన్ దావ వసంత, లోక బాపురెడ్డి, శీలం ప్రియాంక ప్రవీణ్, మున్నా, వెంకటేశ్వర రావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు 296 రెసిడెన్షియల్ స్కూల్స్ ఉంటే, తెలంగాణ ఏర్పాటు తర్వాత 613 రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రెండున్నరేళ్ల కాలం గడుస్తున్నా ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి రెసిడెన్షియల్ స్కూల్ కు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని ఆలోచన కూడా చేయలేదన్నారు.కెసిఆర్ నూతన జిల్లాలు ఏర్పాటు చేసి ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల, అనుబంధంగా ఆస్పత్రులు మంజూరు చేశారని తెలిపారు.హైదరాబాద్ కు నలువైపుల నాలుగు టీమ్ ఆస్పత్రులు ఏర్పాటు చేశారన్నారు.గత ప్రభుత్వం ప్రారంభించిన పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత సీఎం పై ఉందన్నారు.గత ప్రభుత్వ పాలనలో ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ స్కూల్స్ లో వసతులు కల్పించకుండా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ వ్యవహారం తెర పైకి తీసుకు వచ్చారని ఎద్దేవా చేశారు.గతంలో కొనసాగుతున్న స్కూళ్లకు అనుగుణంగా యంగ్ ఇండియా స్కూల్స్ అదనంగా ఏర్పాటు చేస్తున్నారని భావిస్తే.... సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వడం లేదన్నారు.గతంలో కేసీఆర్ ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ స్కూళ్లు కొనసాగిస్తూ, యధావిధిగా వసతులు కల్పిస్తే ఎక్కడ కెసిఆర్ కు పేరు వస్తుందో అని వసతులు కల్పించడం లేదన్నారు. మౌలిక సదుపాయాలు మెరుగు పర్చడానికి ఏవిధమైన చర్యలు చేపట్టలేదన్నారు.శాశ్వత భవనాలు నిర్మించకపోవడం పై ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయని తెలిపారు. నిరుద్యోగులు నూతన ఉద్యోగాలు కల్పిస్తారని భావిస్తుంటే వెల్లడించడం లేదన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ విది విధానాలు ఏమిటి..... బోధన నియామకాలు ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. గత రెసిడెన్షియల్ స్కూళ్ళు యధావిధిగా కొనసాగిస్తూ, స్థానికంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఒక్కో పాఠశాల నిర్మాణం కోసం 200 కోట్ల చొప్పున 20 వేల కోట్ల కోసం వేచి చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి కనుసన్నల్లో కాంట్రాక్ట్ పనులు కొనసాగేల, స్థానిక రెసిడెన్షియల్ పాఠశాలు నిర్మాణాలు చేపట్టకుండా లరేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్ విధి విధానాలు ప్రకటించాలి నియామకాలు ప్రక్రియ వెల్లడించాలి జీవన్ రెడ్డి డిమాండ్రాజ్యాంగా నిబంధనలను అనుగుణంగా గురుకుల పాఠశాలలు ఎక్కడికక్కడ శాశ్వత భవనాలు నిర్మిస్తూ విద్యా వ్యాప్తికి కృషి చేయాలని టి.జీవన్ రెడ్డి అన్నారు.చల్గల్ లో కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాలు అవసరమైతే 2 ఎకరాలు మాత్రమే కేటాయించారని తెలిపారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కు కనీసం 20 ఎకరాలు అవసరం కాగా, 10 ఎకరాలు కేటాయించారని తెలిపారు.జిల్లా కలెక్టర్, మంత్రి కూడా 20 ఎకరాలు కేటాయించాలని కోరితే 10 ఎకరాలు కేటాయించడం ఏమిటనీ ప్రశ్నించారు.ప్రభుత్వమే ఎమ్మెల్యే కనుసన్నల్లో నడుస్తుండగా, 10 ఎకరాలు కేటాయించడం ఏమిటి.. రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేయాలని ఉందా... లేదా.. అన్నారు.ఎమ్మెల్యేకు పాలాభిషేకాలు చేయడం ఎందుకు 20 ఎకరాలు అవసరం అయితే 10 ఎకరాలకు కుదించంబడినందుకా... అని నిలదీశారు.బీసి, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలకు స్థానికంగా స్థల సేకరణ చేసి, శాశ్వత భవనాలు ఏర్పాటు చేయడంతో ప్రజల్లో విద్యా ప్రాధాన్యం పెరుగుతుందన్నారు.సీఎం రేవంత్ రెడ్డికి జగిత్యాల పట్ల వివక్షతనా.. నిర్లక్ష్యమా.. అని ప్రశ్నించారు. నా మీద కోపం ఉన్నా పర్వాలేదు. ప్రజలు హక్కుగా భావించే హక్కుల పట్ల నిర్లక్ష్యం చూపడం సరికాదన్నారు.మంత్రి లక్ష్మణ్ కుమార్ బాధ్యత తీసుకొని యంగ్ ఇండియా స్కూల్ కు 20 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాలు కేటాయింప జేయాలని సూచించారు.చల్గల్ లో స్థలం కొరత లేదు. వ్యవసాయ ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించగా వ్యవసాయ పరిశోధనకు మరో 50 ఎకరాలు మిగిలి ఉంటుందన్నారు.జగిత్యాలలో ఉద్యానవన యూనివర్సిటీ అవసరం ఉన్నదని తెలిపారు.చల్గల్ లో ఉద్యాన వన యూనివర్సిటీ మంజూరు చేయాలని బీఆర్ఎస్ పక్షాన, రైతుల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు.

# ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ , సైన్స్ కళాశాలలో ఘనంగా జాబ్ మేళా నిర్వహణ

**జగిత్యాల మే 20(ప్రజా మంటలు) :**పట్టణంలోని ఎస్ కే ఎన్ ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జిల్లా యువజన మరియు క్రీడాశాఖ, జిల్లా ఉపాధి కల్పన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జాబ్ మేళా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ రాజా గౌడ్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగాలను సాధించాలంటే యువత తప్పనిసరిగా ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా కంప్యూటర్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాలు ప్రతి ఒక్కరికీ అత్యవసరమని తెలిపారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా తమ ప్రతిభను, నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకుంటే మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీమతి బి. సత్తెమ్మ మాట్లాడుతూ, యువత సాంకేతిక నైపుణ్యాలు మరియు ఉద్యోగ సంబంధిత నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రతిభ కలిగిన అభ్యర్థుల కోసం అనేక కంపెనీలు ఎదురుచూస్తున్నాయని, సరైన నైపుణ్యాలు కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలకు కొదవ లేదని తెలిపారు.ఈ జాబ్ మేళాలో వివిధ సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. మొత్తం 60 మంది ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. అశోక్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు ఉద్యోగ నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కళాశాలలో ఇలాంటి ఉపాధి అవకాశాల కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి వై ఎస్ ఓ డాక్టర్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. శ్రీనివాస్, ఎన్సిసి అధికారి మరియు టీఎస్ కెసి




కోఆర్డినేటర్ లెఫ్టినెంట్ డాక్టర్ పి. రాజు, అధ్యాపకులు కె. శ్రీనివాస్, అంకం గోవర్ధన్, కె. సురేందర్, డాక్టర్ జి.వి.ఆర్ సాయి మాధుకర్, రాజిత, ప్రమోద్, దివ్యారాణి, కవిత, డాక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్సిసి క్యాడెట్లు మరియు పెద్ద సంఖ్యలో ఉద్యోగార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చిరాన్‌కుంట, కేబీఆర్‌పార్క్‌పరిరక్షణకు కేంద్రం సీరియస్

### రాష్ట్ర అటవీ శాఖకు ఆదేశాలు

### అడ్వకేట్ రామారావు పిటీషన్ కు స్పందన

**సికింద్రాబాద్,మే20 ( ప్రజామంటలు):**కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) జాతీయ పార్క్ పరిసరాల్లోని చిరాన్‌కుంట ప్రాంతంలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ ఫారెస్ట్ ప్రొటెక్షన్ డివిజన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రాంతంలో జరుగుతున్న పర్యావరణ నష్టాన్ని అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ అటవీ శాఖను కేంద్రం ఆదేశించింది. తెలంగాణకు చెందిన ప్రముఖ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందించిన కేంద్ర అధికారులు, హెచ్ఐసీ ప్రాజెక్ట్ పరిధిలో జరుగుతున్న పర్యావరణ నష్టంపై తక్షణమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేశారు. అలాగే ఈ అడ్వాన్స్ యాక్షన్ రిపోర్ట్ కాపీని ఫిర్యాదుదారునికి కూడా అందజేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.ఈ సందర్భంగా న్యాయవాది రామారావు ఇమ్మనేని మీడియాతో మాట్లాడుతూచిరాన్‌కుంట అనేది తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి, నిజాంల దాతృత్వానికి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. కేబీఆర్‌నేషనల్ పార్క్ చుట్టూ ఉన్న జీవవైవిధ్యాన్ని కాపాడాల్సిన రాజ్యాంగబద్ధమైన, పర్యావరణ బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ పార్కు పర్యావరణ వ్యవస్థలో నెమళ్లు, సరీసృపాలతో సహా 56 రకాల జంతుజాలం, దాదాపు 456 రకాల వృక్షజాతులు మనుగడ సాగిస్తున్నాయని వివరించారు. హైదరాబాద్ చారిత్రక వారసత్వానికి గుర్తింపుగా కేబీఆర్ పార్కుకు "ప్రిన్స్ ముకర్రం జా పార్క్" అని పునఃనామకరణం చేయాలని ఆయన కేంద్రానికి డిమాండ్ చేశారు. కేబీఆర్ పరిసరాల్లో జరుగుతున్న ప్రకృతి వనరుల విధ్వంసం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో ఇలాంటి పర్యావరణ సమస్యలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకుండా నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని పర్యావరణ



ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు. హైదరాబాద్ నగరానికి ఆభరణం లాంటి కేబీఆర్ పర్యావరణాన్ని, చారిత్రక సంపదను కాపాడుకునేందుకు ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు, నగర ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# అనుమానాస్పద వ్యక్తులకు లాడ్జ్ గదులు ఇవ్వొద్దు

### గుర్తింపు పత్రాలు తప్పనిసరి తనిఖీ చేయాలి

### ఆధార్ లింక్ సెల్ నంబర్లను క్రాస్ చెక్ చేయాలి

### జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి - చుక్క గంగారెడ్డి ( ప్రజా మంటలు ) మే 20 :** అనుమానస్పద వ్యక్తులకు, గుర్తు తెలియని వ్యక్తులకు లాడ్జ్ గదులు అద్దెకు ఇవ్వకూడదని జగిత్యాల టౌన్ సి. ఐ. కరుణాకర్ అన్నారు. బుధవారం ఆయన శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పట్టణ పోలీస్ స్టేషన్ పరిదిలోని లాడ్జ్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిర్వాహకులు తప్పనిసరిగా పాటించవలసిన భద్రత నిబంధనలు, మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ మాట్లాడుతూ లాడ్జ్‌లలో గదులు కేటాయించే ముందు ప్రతి ఒక్కరి నుండి ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. వారి పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి భద్రపరచాలని తెలిపారు. ఆధార్ లింక్ ఉన్న సెల్ నంబర్ల ను క్రాస్ చెక్ చేయాలని పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో పోలీసులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. లాడ్జ్ ప్రాంగణం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రవేశ ద్వారాలు, రిసెప్షన్, పార్కింగ్ ప్రదేశాలు, కారిడార్లలో నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి 24 గంటల పాటు నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని తెలిపారు. సీసీ ఫుటేజ్ కనీసం కొంతకాలం భద్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులకు లేదా సరైన గుర్తింపు పత్రాలు లేని వారికి గదులు కేటాయించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం వలన నేరాలకు అవకాశం ఏర్పడే ప్రమాదం ఉన్నందున లాడ్జ్ యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద కదలికలు గమనించిన



వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీసు శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన లాడ్జ్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. పట్టణ భద్రతలో లాడ్జ్ నిర్వాహకుల సహకారం అత్యంత కీలకమని, ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# జగిత్యాల జిల్లాలో ఘోర విషాదం

### కోనేరులో పడి ముగ్గురు చిన్నారులు మృతి







**జగిత్యాల మే 20( ప్రజా మంటలు ) :** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆటలాడుకుంటూ వెళ్లిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు కోనేరులో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయవిదారక ఘటన మేడిపల్లి మండల పరిధిలోని కొండా పూర్ గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఒకేసారి ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో ఒకేసారి తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కొండపూర్ గ్రామానికి ష ర్వింద్ (7) జగిత్యాల జంబి గద్దె ప్రాంతానికి చెందిన నాగభూషణం లహరిల పిల్లలు మనవిత్ (10), మనస్విని (9), అనే చిన్నారులు కొండాపూర్ లో చిన్నమ్మ వాళ్ళ ఇంట్లో తెప్ప మొక్కు తీసుకునే క్రమంలో కొండాపూర్ కు చేరుకున్నారు .భోజనాలు అయిన అనంతరం పిల్లలు ముందుగా భోజనాలు పూర్తి చేసుకొని ఆలయం వద్ద ఉన్న కొనేట్లో ముగ్గురు చిన్నారులు ఆడుకోవడానికి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలోని కోనేరు సమీపంలోకి వెళ్లిన చిన్నారులు ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటి నుంచి బయటకు రాలేక ఊపిరాడక ముగ్గురూ నీటిలోనే ప్రాణాలు విడిచారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. చిన్నారులు కోనేరులో పడిపోయిన విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ వెంటనే మేడిపల్లి పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో కోనేరులో గాలించి చిన్నారుల మృతదేహాలను వెలికితీశారు. ముక్కుపచ్చలారని చిన్నారుల శవాలను చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. జగిత్యాల ఆసుపత్రికి చిన్నారుల మృతదేహాలను తరలించారు .

# పిల్లలతో కలసి పుట్టింటిలో ఉంటున్నా,చావు తప్పలేదు

### సెలూన్ పార్లర్,స్పా సెంటర్ లో భార్య దారుణ హత్య కేసులో కిరాతక భర్త అరెస్ట్



**సికింద్రాబాద్,మే20 ( ప్రజామంటలు):**నగరంలోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సంచలనం సృష్టించిన డెబోరా అనే మహిళ హత్య కేసులో నిందితుడైన ఆమె భర్త బింగి రాజును పోలీసులు అరెస్టు చేశారు. భార్యను కిరాతకంగా నరికి చంపిన అనంతరం పరారైన నిందితుడు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోగా, గాంధీనగర్ పోలీసులు అతడిని అధికారికంగా అదుపులోకి తీసుకొని,రిమాండ్ కు తరలించారు. గాంధీనగర్ ఇన్స్పెక్టర్ బోస్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం... భార్యపై కక్ష పెంచుకున్న రాజు ఆమెను అంతమొందించాలని పథకం వేశాడు.ఈ నెల 19వ తేదీ (మంగళవారం) ఉదయం డెబోరా తన నివాసం నుంచి ఆటోలో ఆఫీస్ కు బయలుదేరగా, రాజు తన ద్విచక్ర వాహనంపై ఆమెను వెంబడించాడు. డెబోరా కార్యాలయానికి చేరుకుని నాలుగో అంతస్తులోకి వెళ్లగానే, రాజు వెంట తెచ్చుకున్న కత్తి, కొడవలితో ఆమెపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. విచక్షణారహితంగా పలుమార్లు పొడవడంతో తీవ్ర రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘోరానికి ఒడిగట్టిన అనంతరం నిందితుడు ఆయుధాలు, వాహనంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రస్తుతం అటు తల్లి చనిపోగా, తండ్రి జైలుకు వెళ్ళడంతో ఇద్దరు చిన్నారులు అనాధగా మారడం స్థానికంగా అందరిని కంటతడి పెట్టించింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. హత్యానంతరం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన ఒక స్టెయిన్‌లెస్ స్టీల్ కత్తి, ఇనుప కొడవలితో పాటు ఎరుపు రంగు హీరో డెస్టినీ ప్రైమ్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కె. మూర్తి పర్యవేక్షణలో, గాంధీనగర్ ఏసీపీ ఏ. యాదగిరి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఎన్. బోస్ కిరణ్, ఎస్ఐల బృందం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



**భీమదేవరపల్లి, మే 14(ప్రజా మంటలు):-** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2026-2027 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ పి.జ్యోతి తెలిపారు.ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఉచిత విద్యతో పాటు పాలిటెక్నిక్, ఈఏపీసెట్ కోచింగ్ ఇస్తామన్నారు. ప్రతిభగల విద్యార్థినులకు ఐఐటీ, నీట్ కోచింగ్ కూడా ఉంటుందని తెలిపారు. అర్హులైన బాలికలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం ఈ నెంబర్లను 8247281455, 8317505361 సంప్రదించాలని తెలిపారు..

# కొప్పూర్ గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ విరాళం



**భీమదేవరపల్లి, మే 20 ( ప్రజా మంటలు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి కొమ్ముల సుగుణవీరస్వామి జ్ఞాపకార్థం యువ దాతలు ప్రదీప్, ప్రణయ్ ఫ్రీజర్ బాక్స్‌ను బుధవారం విరాళంగా అందజేశారు.గ్రామీణ ప్రాంతాల్లో మృత దేహాలను భద్రపరచేందుకు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రజల అవసరార్థం ఈ సేవ చేపట్టినట్లు దాతలు తెలిపారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రజలకు ఉపయోగపడే సేవ చేయడం అభినందనీయమని గ్రామ పెద్దలు కొనియాడారు.అనంతరం దాతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. యువత సేవా కార్యక్రమాల్లో ముందుండటం ఆదర్శమని పలువురు పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ గద్ద కుమారస్వామి, ఉప సర్పంచ్ మిరియాల రాణి రాజు, కార్యదర్శి రత్నకుమారి, మాజీ సర్పంచ్‌లు కొమ్ముల రమేష్, కొత్తకొండ భాగ్యలక్ష్మి రాజమొగిలి, కొయ్యడ జనార్ధన్, మాజీ ఎంపీటీసీ గడిపే బిక్షపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మండల సురేందర్, గట్ల నర్సింగాపూర్ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, పార్టీల గ్రామ శాఖ అధ్యక్షులు, గ్రామ ప్రముఖులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ' తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యునిగా చింతల శ్రీనివాస్



**జగిత్యాల మే 20(ప్రజా మంటలు) :**అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షులుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నౌండ్ల సంతోష్ చారి సంఘ బలోపేతం, విశ్వకర్మ సమాజ సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని 69 మంది సభ్యులతో కూడిన నూతన రాష్ట్ర కమిటీని అధికారికంగా నియమిస్తున్నట్టు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విశ్వకర్మ సమాజాన్ని ఒక తాటిపైకి తీసుకువచ్చి యువత, మహిళలు, మేధావులు , సామాజిక సేవకులను సంఘ నిర్మాణంలో భాగస్వాములను చేయడం ప్రధాన ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు.ఈ నూతన కమిటీలో జగిత్యాల జిల్లాకు సముచిత స్థానం దక్కింది. జిల్లాకు చెందిన చింతల శ్రీనివాసును రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా , అలాగే జగిత్యాల జిల్లా సలహాదారులుగా నియమించారు. తమ జిల్లా నేతకు రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలు దక్కడంపై జగిత్యాల జిల్లా విశ్వకర్మ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.ఈ రాష్ట్ర కమిటీ నియామకం విశ్వకర్మ సమాజంలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని, నూతనంగా ఎంపికైన రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# సంపూర్ణ మద్దతు తెలిపిన మండల కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్

### అధ్యక్షుడు గొడిశాల కిషన్, నందనం రవి



**ఎల్కతుర్తి మే 20 ప్రజా మంటలు :**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన 24 గంటల దేశవ్యాప్త బందులో భాగంగా మండలంలోని మెడికల్ దుకాణాలు స్వచ్ఛందంగా సంపూర్ణంగా బందు నిర్వహించాయి. ఎల్కతుర్తి మండల కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు గొడిశాల కిషన్ నందనం రవి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఆన్లైన్ ద్వారా మందులు విక్రయించవద్దని డిస్కౌంట్ ల పేర్లతో నకిలీ మందుల విక్రయం అరికట్టాలని అన్నారు. దీనివల్ల చిన్న మెడికల్ షాపులు తీవ్రంగా నష్టపోతున్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న కెమిస్ట్ లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ బందు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చిన్న వ్యాపారులను రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మండలంలోని మెడికల్ షాపుల యజమానులు ఐక్యంగా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా పాల్గొనడం బంద్ ను విజయవంతం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనగాని ప్రవీణ్, గొడిశాల కార్తీక్, చిర్ర ఉదయ చందర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# బీరయ్య పట్నాలు గొల్ల కుర్మల ఆత్మ గౌరవానికి ప్రతీక

### జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) మే 20:** బీరయ్య - కామరాతి బోనాలు, పట్నాలు , గొల్ల కురుమల ఆత్మ గౌరవానికి ప్రతీక అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన జగిత్యాల మండలం గొల్లపల్లె గ్రామంలో బీరయ్య - కామరాతి ల కళ్యాణ మహోత్సవానికి, మహంకాళి బోనాల పట్నాలు మహోత్సవానికి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడారు. ఈ పవిత్ర సంప్రదాయాలను, ఒగ్గు కళ ను కాపాడు కుంటూనే, గొల్ల కురుమ సంఘం, గ్రామ ఐక్యతను చాటడం పండుగ ప్రాముఖ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్, ఉప సర్పంచ్ తిరుపతి, కౌన్సిలర్ చెట్టే గంగాధర్, మాజీ ఎంపిటిసి శంకర్, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ శ్రీకాంత్, శ్రీనివాస్, గంగ మల్లయ్య, గొల్ల కురుమ సంఘం పెద్దలు, గ్రామస్తులు, నాయకులుతదితరులు పాల్గొన్నారు.

# 48 లక్షల బిటి రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ప్రజా మంటలు, మే 20:** జగిత్యాల పట్టణ 42వ వార్డులో 48 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను పరిశీలించి, నాణ్యతతో పనులు చేయాలని, త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని బుధవారం జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.62 కోట్లతో జగిత్యాల లో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.పార్కు సంధి దుకాణ దారులు చెత్తను ఇష్టారీతిన పడేయవద్దని మున్సిపల్ చెత్త వాహనాలకు అందించాలన్నారు.నూతన బిటి రోడ్డు పక్కన వర్షం నీరు పోయే విదంగా ధోనీ మాదిరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.అప్పుడే బీటీ రోడ్డు చెడిపోకుండా ఉంటుందన్నారు.జగిత్యాల పట్టణంలో ట్రేడ్ అనుమతులు ఇచ్చి రెవెన్యూ పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.పట్టణంలో నాణ్యతతో పనులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రణవ్, కౌన్సిలర్ నాగరాజు, బొలుసాని శ్రీనివాస్,డి.ఈ. ఆనంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు సమీండ్ల శ్రీనివాస్, దాసరి ప్రవీణ్, పోతునుక మహేష్, రాజు, కప్పల శ్రీకాంత్, ఈశ్వర్, ఏ.ఈ. అనిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుర్చి తాత ఇకలేడు



కుర్చీ మడతపెట్టి' డైలాగ్‌తో సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన 'కుర్చీ తాత' (మహ్మద్ పాషా) హఠాన్మరణం చెందారు. ఆయన వాకింగ్ చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి కన్నుమూశారు. వివరాలు : నగరంలోని కృష్ణకాంత్ పార్కులో వాకింగ్ చేస్తుండగా గుండెపోటు కారణంగా ఒక్కసారిగా కుప్పకూలారు.

